విశ్వ విజ్ఞానం యావత్తు మానవాళి సమిష్టి సంపద
సమిష్టి సంపదను పరిరక్షించేవే మేధోసంపద హక్కులు

నిరంతరం పురోగమిస్తున్న విశ్వవిజ్ఞానం, మేధో సంపద మానవుడి సమిష్టి సంపద. వ్యవసాయ పనిముట్టు నాగలి మొదలుకొని ఈనాటి అరచేతిలో అంతరిక్షం స్మార్ట్ ఫోన్ వరకు మేధో సంపద రూపాలే. స్మార్ట్ ఫోన్‌తో కరెంట్ బిల్ చెల్లించవచ్చు, దీనితోనే నేరాలకు పాల్పడుతున్నారు కొందరు. మనిషి చంద్రుడి మీద పాదం మోపాడు, చంద్రుడికి కూడా రియల్ ఎస్టేట్ వ్యాధి అంటించాడు, దీపం కింద చీకటిలా – ఈ సమిష్టి మానవాళి సంపద దుష్ట శక్తుల చేతుల్లో పడకుండా, దుర్వినియోగం కాకుండా నాగరిక సమాజం మేధో హక్కులు భావనకు జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలోనే తెలుగు సమాజంలో చోటుచేసుకున్న రెండు సంఘటనలు గమనిద్దాం. దాసరి నారాయణరావు గోరింటాకు సినిమా తెరపై కథా రచయిత్రి రామలక్ష్మి. హైకోర్టుకెళ్ళి "ఇది నా న్యాయం" తన కథకు మక్కీకి మక్కీ అని కేసు వేసి రంగనాయకమ్మ కేసు గెలిచారు, నష్టపరిహారం పొందారు. ఇటీవలే ప్రముఖ కవి శేషేంద్ర శర్మ గ్రంథ హక్కులపై తలెత్తిన వివాదం మనకు తెలిసిందే. శేషేంద్ర తన భర్త అని 2006 లో గ్రంథ హక్కులు తనకు రాసిచ్చాడని, 2008 లో ఇందిరా ధన్‌రాజగిర్ కోర్టుకు దాఖలు చేసినది బనాయింపు పత్రం అని 2018 లో కోర్టు తీర్పు చెప్పింది. 1989 లో శేషేంద్ర రాసిన పత్రమే నిజమైందని, శేషేంద్ర గ్రంథ హక్కులు ఆయన కుమారుడు సాత్యకి కే దక్కుతాయని తీర్పు చెప్పింది. ఈ సందర్భంలో సాత్యకి తో సత్యాన్వేషణ.

ప్ర. గ్రంథ హక్కులు మీవని ఎలా చెప్పగలరు ? సాక్ష్యాధారాలేమిటి ?

జ. నేను ప్రత్యేకించి చెప్పనవసరంలేదు. 1989లో స్వంత చేతిరాతలో నాన్న రాసిన పత్రం కోర్టుకు కేసులో సమర్పించాను. 1990 లో అప్పటి ఉదయం వారపత్రికలో కూడా వార్తవచ్చింది. 1994లో అచ్చు అయిన "ఎంతకాలం ఈ ఎండమావులు?" పుస్తకంలో ఈ పత్రం స్కాన్ అయిన కాపీ అచ్చు అయింది. ఇదే అసలు పత్రం అని కోర్టు తీర్పు చెప్పింది.

ప్ర. ఇందిరా ధన్‌రాజ్‌గిర్ పత్రం మాటేమిటి?

జ. ఈ విషయం కూడా కోర్టు స్పష్టం చేసింది. ఆమె పత్రాన్ని తెలంగాణా ఫోరెన్సిక్ లెబరేటరీ కి పంపించి వారి నివేదిక ఆధారం చేసుకునే తీర్పు చెప్పింది. ఇది నకలీ పత్రం అని స్పష్టం చేసి ఇందిర గారి నేర ప్రవృత్తిని బయట పెట్టింది. నాన్న 2007 లో కాలంచేసిన కొద్దిరోజులలోనే రాసిన "శేషేంద్ర వారసులు ఎవరు?" వ్యాసంలో, 2008 లో ప్రో. ఎస్ వి సత్యనారాయణ గారు చేసిన ఇంటర్వ్యూలో ఆమె నేర ప్రవృత్తిని వివరించాను. ఆమె పేరు ఎన్నో చోట్ల, ఎన్నో రూపాల్లో కనిపిస్తుంది.

ప్ర. ఆమె పుస్తకాలు ముద్రిస్తే తప్పేమిటి?

జ. సాహిత్యం వ్యక్తుల నేర ప్రయోజనాల కోసం దుర్వినియోగం కాకూడదు. నాన్న పుస్తకాల విషయంలో 30 యేళ్లకు పైగా ఇదే జరుగుతూ వచ్చింది. అసలు ఘోరం ఏమిటంటే వివాదానికి గురైన "కామోత్సవ్" నవల మరెవరితోనో తిరగరాయించి నాన్న పేరుతో ప్రింటు చేయించింది. ఇది మూల రచనలకు ఎంతటి పెనుప్రమాదమో ఊహించ గలరా? నాన్న చనిపోయిన నెల రోజులలోనే జరిగిన సంస్మరణ సభల్లో కొందరు వేదిక ఎక్కి "కామోత్సవ్" నేను రాసానంటే నేను రాసానని ఇద్దరు ముగ్గురు ప్రకటించుకున్నారట. సాహిత్యంలో ఇంతకు మించిన ఘోరం ఇంకొకటి ఉంటుందా? ఇదే కనుక కొనసాగితే, కోర్టుకు దాఖలు చేసిన నకిలీ పత్రంలా నాన్న రాయని రచనలు ఆయన పేరుతో రంగంలోకి వస్తాయి. ఇలాంటి ఘోరాలకు అంతుండదు. కనుక నైతికంగా, న్యాయబద్ధంగా నాన్న నాకు రాసిచ్చిన కాపీరైట్స్ ప్రకారమే ఈ ధోరణిని అరికట్టే ప్రయత్నం చేస్తున్నాను.